హామీలు అమలు చేయాలి



2





2

ఆశలన్నీ బోనస్‌పైనే..



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా అదనపు కలెక్టర్ అంకిత్



**అక్షరటుడే, ఇందూరు :** నిజామాబాద్ నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్‌కు బాధ్యతలు అప్పజెప్పారు. ఈ మేరకు ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ దీర్ఘకాలిక సెలవులో వెళ్లగా అదనపు కమిషనర్ రవీందర్‌కు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించారు. కాగా.. తాజాగా అదనపు కలెక్టర్‌కు బాధ్యతలు ఇచ్చారు.





## గంగపుత్రుల అభ్యున్నతికి కృషి: రాకేశ్ రెడ్డి

**అక్షరటుడే, ఆర్మూర్:** గంగపుత్రుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి అన్నారు. ఆర్మూర్ గుండ్ల చెరువులో వందశాతం సబ్సిడీపై చేప పిల్లలను చేరువలో వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గంగపుత్రులకు గతంలోనూ వాహనాలు పంపిణీ చేశామన్నారు. చెరువులు కబ్జా కాకుండా చూసుకోవాలని సూచించారు. చెరువులో కలుషిత నీరు కలవకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, వేణు, కలిగోట్ గంగాధర్, భరత్, ఉదయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి కోసం గ్రామ పంచాయతీ ముట్టడి



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి :** కమ్మర్ పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఎస్సీ, బీసీ కాలనీ వాసులు సోమవారం ముట్టడించారు. ఖాళీ బిందెలు, బకెట్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు నెలల నుంచి నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజ శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్యదర్శి గంగా జమున వచ్చి మిషన్ భగీరథ ఏఈని పిలిపించి నీటి సమస్యను మూడు రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. అప్పటి వరకు ట్యాంకర్‌తో నీటి సరఫరా చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. నీటి సమస్యను త్వరగా పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని కాలనీ హెచ్చరించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కానిస్టేబుళ్ల కుటుంబాలకు బీమా చెక్కుల అందజేత




**అక్షరటుడే, కామారెడ్డి:** గాంధారికి చెందిన కానిస్టేబుల్ వడ్ల రవి విధి నిర్వహణలో భాగంగా గతేడాది కారు ఢీకొనడంతో మృతి చెందాడు. అలాగే పిట్లం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ బుచ్చయ్య రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. అయితే కానిస్టేబుళ్లు రవి, బుచ్చయ్యలకు ఎస్‌బీఐలో శాలరీ అకౌంట్ ఉండడంతో సంబంధిత బ్యాంక్ అధికారులు వారికి మంజూరైన రూ. కోటి చొప్పున బీమా చెక్కులను ఎస్పీ రాజేష్ చంద్ర చేతుల మీదుగా కానిస్టేబుళ్ల కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులు మాట్లాడుతూ.. పోలీస్ విధులు నిర్వర్తిస్తున్న ప్రతి ఉద్యోగి ఎస్‌బీఐలో శాలరీ ఖాతా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, ఎస్‌బీఐ నిజామాబాద్ డీజీఎం బిజయ్ కుమార్ సాహూ, కామారెడ్డి ఆర్ఎం వెంకటేశ్వర్లు, చీఫ్ మేనేజర్ సోమేశ్వర్ రావు, చీఫ్ మేనేజర్ వరప్రసాద్, హెచ్ఆర్ మేనేజర్ రమణ, బ్రాంచ్ మేనేజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డుల కోసం పేద ప్రజలకు ఎదురు చూపులు తప్పడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం చాలా ఏళ్ల తర్వాత ఇటీవల కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేసింది. కొత్తగా అనేక మందికి కార్డులు మంజూరు చేసింది. అయితే రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని తెలపడంతో ఇంకా చాలా మంది దరఖాస్తు చేసుకుంటున్నారు. కానీ దరఖాస్తులు అప్రూవల్ కాకపోవడంతో కార్డులు పెండింగ్‌లో ఉంటున్నాయి. దీంతో దరఖాస్తుదారులు తమకు కార్డులు ఎప్పుడిస్తారని అధికారులు, రేషన్ దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. - అక్షరటుడే, కామారెడ్డి



# రేషన్ కార్డుల కోసం నిరీక్షణ

- దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా రాని వైనం
- తమ వద్ద పెండింగ్ లేవంటున్న తహశీల్దార్లు
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ప్రజలు

రాష్ట్రవ్యాప్తంగా జులై 25న కొత్త రేషన్ కార్డులు పంపిణీని ప్రారంభించారు. గతంలో రేషన్ కార్డులలో పేర్లు లేనివారు, రేషన్ కార్డు మొత్తానికి లేనివారు దరఖాస్తు చేసుకోగా దాదాపుగా అందరికి రేషన్ కార్డులు మంజూరయ్యాయి. జిల్లాలో కూడా కొత్తగా 12 వేలకు పైగా నూతన రేషన్ కార్డులు వచ్చాయి. అయితే అప్పుడు దరఖాస్తు చేసుకోని కొంతమంది ఇటీవల దరఖాస్తు చేసుకున్నారు. ముఖ్యంగా ఉమ్మడి కుటుంబాల్లో ఉన్న వారు.. తమ పేర్లను పాత కార్డులో తీసి వేయించి, కొత్త దానికోసం అప్లయ్ చేశారు. అయితే దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా ఇంకా కొత్త కార్డులు రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అక్కడ పెండింగ్

కొత్తగా రేషన్ కార్డులు, కార్డులో పేర్ల నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న వారు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమ లాగిన్‌లో రేషన్ కార్డుల దరఖాస్తులు పెండింగ్‌లో లేవని తహశీల్దార్లు చెబుతున్నారు. సివిల్ సప్లయ్ అధికారుల లాగిన్‌లో అప్రూవల్ పెండింగ్ ఉందని చెబుతున్నారు. దీంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. కొత్త కార్డులు వెంటనే మంజూరు చేయాలని కోరుతున్నారు.

### జిల్లాలో రేషన్ కార్డులు ఇలా..

జిల్లాలో మొత్తం 578 రేషన్ దుకాణాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 2,90,736 రేషన్ కార్డులున్నాయి. ప్రతి నెల 6266.77 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా అవుతుంది.

### అప్రూవ్ చేశాం

కొత్తగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను ఎప్పటికప్పుడు అప్రూవల్ చేస్తున్నాం. రెండు రోజుల క్రితమే దాదాపు వెయ్యి వరకు దరఖాస్తులు అప్రూవ్ చేశాం. అప్రూవల్ అయ్యాక మరుసటి నెలలో రేషన్ బియ్యం వస్తాయి. దరఖాస్తుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– వెంకటేశ్వర్లు, డీసీఎస్‌వో కామారెడ్డి

## సృజనాత్మకతను పెంచేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం



**అక్షరటుడే, బోధన్:** విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను పెంపొందించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని విజయ మేరీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి సైన్స్ ఫేర్, ఇన్ స్పైర్ ప్రదర్శనను సోమవారం ఆయన ప్రారంభించారు. కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డితో కలిసి సైన్స్ ఫేర్‌లో విద్యార్థులు రూపొందించిన వైజ్ఞానిక ప్రదర్శన నమూనాలను ఎంతో ఆసక్తితో తిలకించారు. సుస్థిర అభివృద్ధి, లాభదాయకమైన కూరగాయల పంటల సాగు, సోలార్ వినియోగం, పర్యావరణ పరిరక్షణకు ఉపకరించే సాధనాల ప్రయోగాలను ఆయన తిలకించారు. కాలుష్య నియంత్రణ, ఆరోగ్యకరమైన ఆహారం తదితర అంశాలపై సరికొత్త ఆలోచనలతో సృజనాత్మకతను జోడిస్తూ ప్రదర్శనలు రూపొందించిన విద్యార్థులను అభినందించారు. రాష్ట్ర, జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల్లోనూ ప్రతిభ చాటాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, డీసీసీబీ ఛైర్మన్ రమేష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, డీఈవో అశోక్, సైన్స్ ఫేర్ అధికారి గంగా కిషన్ పాల్గొన్నారు.

## ముప్కాల్ ఎస్సైగా కిరణ్‌పాల్ బాధ్యతల స్వీకరణ



**అక్షరటుడే: ముప్కాల్:** ముప్కాల్ పోలీస్ స్టేషన్ ఎస్సైగా కిరణ్‌పాల్ బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు విధులు నిర్వహించిన ఎస్సై రజినీకాంత్ ఆర్మూర్-1కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన కిరణ్‌పాల్‌ను అధికారులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

## డాక్టర్ రమణేశ్వర్‌కు గ్లోబల్ ఎక్స్‌లెన్స్ అవార్డు

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా కేంద్రంలోని శ్రీవిష్ణు హాస్పిటల్ న్యూరో సర్జన్ డాక్టర్ రమణేశ్వర్‌కు గ్లోబల్ ఎక్స్‌లెన్స్ అవార్డు దక్కింది. రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్ అండ్ సర్జన్స్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన సమ్మిట్‌లో అవార్డును అందజేశారు. పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణేశ్వర్ మాట్లాడుతూ అవార్డు అందుకోవడంతో తన బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు.



## పంచాయతీ ఎన్నికలకు డివిజన్ల ఖరారు



**అక్షరటుడే, ఇందూరు:** గ్రామ పంచాయతీ ఎన్నికలకు అధికార యంత్రం సమాయత్తమవుతోంది. డివిజన్ల వారీగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లను సైతం సోమవారం అధికారికంగా ప్రకటించారు. దీంతో ఎన్నికల సందడి మొదలుకానుంది. బ్యాలెట్ బాక్సులను సైతం ఆయా మండలాలకు తరలిస్తున్నారు. జిల్లాలో మొత్తం 545 సర్పంచ్, 5022 వార్డు స్థానాలకు రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లను కేటాయించారు.

## లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ




**అక్షరటుడే, బాల్కొండ:** ముప్కాల్ మండలానికి చెందిన 24 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన ఈ పథకం పేద కుటుంబాలకు పెద్ద ఊరట కలిగిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లవుతున్నా తులం బంగారం, మహిళలకు రూ.2,500, పెన్షన్ రూ.4,000 వంటి హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

## పోలీస్ ప్రజావాణికి 32 ఫిర్యాదులు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదు దారుల నుంచి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత సీఐలు, ఎస్సైలతో ఫోన్‌లో మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తోందని తెలిపారు. కాగా.. పోలీస్ ప్రజావాణికి 32 ఫిర్యాదులు వచ్చాయి.

## మల్టీలెవల్ మార్కెటింగ్ పేరుతో మోసాలు..



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** లక్కీ జనరల్ ఇండియా జాబ్ మల్టీ లెవెల్ మార్కెటింగ్ పేరుతో మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు సోమవారం సీపీ సాయిచైతన్య వివరాలు వెల్లడించారు. ఎల్జీ ఇండియా పేరుతో ఉన్న యాప్‌లో పెట్టుబడి పెట్టి మోసపోయానని రెంజల్ మండలంలోని సాటాపూర్‌కు చెందిన పిట్ల మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. నగరంలోని ముబారక్‌నగర్‌కు చెందిన మేకల జగదీష్, సాటాపూర్‌నకు చెందిన పెద్ద భూమయ్య అలియాస్ ప్రేంను అదుపులోకి తీసుకున్నారు. వీరి ద్వారా ఎల్జీ ఇండియా యాప్‌నకు సంబంధించిన వివరాలు సేకరించారు. మేకల జగదీష్, ప్రేం అనే ఇద్దరు వ్యక్తులు కలిసి ఎల్జీ ఇండియా యాప్‌లో రూ.25,500 డిపాజిట్ చేసి రోజుకు 16 వీడియోలను క్లిక్ చేస్తే వీడియోకు రూ.55 చొప్పున లాభం వస్తుందని పలువురిని నమ్మించారు. దీంట్లో భాగంగా ఇతరులను ఈ యాప్‌లో జాయిన్ చేస్తే 8 మందికి గాను రూ.4వేలు, 15మంది దాటితే రూ.8వేలు వస్తాయని పేర్కొన్నారు. దీనిని నమ్మిన రెంజల్ మండలం సాటాపూర్‌నకు చెందిన పిట్ల మధు యాప్‌లో రూ.25,500 డిపాజిట్ చేశాడు. అనంతరం లాభాలు వచ్చినప్పటికీ డబ్బు అంతా వ్యాలెట్‌లో ఉండిపోతోంది. చివరకు నిర్వాహకులను నిలదీయగా ముంబయిలో తమ కంపెనీ మేనేజర్ రాజు ఉంటాడని ఆయనకు చెప్పి సమస్య పరిష్కరిస్తామని నమ్మబలికారు. కానీ డబ్బులు రాకపోగా తన బ్యాంక్ అకౌంట్ సైతం ఫ్రీజ్ కావడంతో వెంటనే స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. నిందితులు ఇదేవిధంగా సాటాపూర్‌కు చెందిన 150మందని సైతం మోసం చేసినట్లుగా పోలీసుల విచారణలో తేలింది. ఎల్జీ కంపెనీ యాప్‌లో ఇప్పటివరకు రూ.75లక్షలు పెట్టుబడి పెట్టినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం ఈ యాప్ పనిచేయట్లేదని తెలిపారు. ప్రజలు ఇలాంటి యాప్‌లలో డబ్బులు పెడితే అదనపు ఆదాయం వస్తుందని గుడ్డిగా నమ్మవద్దని ఆయన సూచించారు.

## ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రక్రియ తనిఖీ

**అక్షరటుడే, బోధన్ :** ఎడపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సోమవారం తనిఖీ చేశారు. ఐకేపీ సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్న తీరును పరిశీలించారు. ఇందిరమ్మ చీరల పంపిణీ పూర్తి పారదర్శకంగా, సజావుగా జరగాలని కలెక్టర్ ఆదేశించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తెలంగాణ సాంప్రదాయాన్ని అనుసరిస్తూ గౌరవప్రదమైన రీతిలో ప్రభుత్వం తరపున మహిళలకు చీరను అందించాలని సూచించారు. ఎలాంటి విమర్శలు, వివాదాలకు తావు లేకుండా, అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర పంపిణీ జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలన్నారు. పంపిణీ ప్రక్రియను వేగంగా చేపట్టి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ దత్తాద్రి, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.





## వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట: పోచారం


**అక్షరటుడే, బాన్సువాడ:** గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో సోమవారం రూ. 1.43 కోట్లతో కొత్తగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీ సురేశ్ షెట్కార్, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీహెచ్‌సీలో అత్యవసర వైద్య సేవలు, ప్రసూతి సేవలు, సాధారణ చికిత్సలు, ప్రయోగశాల సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజారోగ్య రంగం బలోపేతం దిశగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా స్థానికులకు నాణ్యమైన ఆరోగ్య సేవలు మరింత చేరువ అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజు, సబ్ కలెక్టర్ కిరణ్మయి, తహశీల్దార్ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.



## బాల్కొండలో మారుతి జోషి వర్ధంతి

**అక్షరటుడే,బాల్కొండ:** కేంద్రంలోని అయ్యప్ప మణికంఠ క్షేత్ర వ్యవస్థాపకులు దివంగత మారుతి జోషి ఆరో వర్ధంతిని ఆలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆయన శిష్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అయ్యప్ప ఆలయం వద్ద అన్నదాన సత్రానికి ఆయన శిష్యులు, భక్తులు సాయం చేశారన్నారు. అలాగే అన్నదాన సత్రానికి తమ వంతుగా నిధులు మంజూరు చేసిన రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేష్ రెడ్డికి, ఎంపీ అర్వింద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాల్కొండ ఎస్సై శైలేందర్ మాజీ ఎంపీపీ లావణ్య లింగా గౌడ్, ఆలయ కమిటీ ఛైర్మన్ సీహెచ్ కిషన్, మాజీ సర్పంచ్ తౌట్ గంగాధర్, గురుస్వాములు బలరాం సింగ్ మెడికల్ నరేందర్ అంబటి నవీన్, మల్లెపూల శ్రీనివాస్ గౌడ్, సాయినాథ్, పెద్ది పవన్, కుందారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు ఆలయాలకు ధూపదీప నైవేద్యం మంజూరు



**అక్షరటుడే, కామారెడ్డి:** నియోజకవర్గంలోని నాలుగు ఆలయాలకు ధూపదీప నైవేద్యం పథకం మంజూరైందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తెలిపారు. ఈ మేరకు సోమవారం పార్టీ కార్యాలయంలో సంబంధిత ఆలయ పూజారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖతో మాట్లాడి నాలుగు దేవాలయాలకు దీపదూప నైవేద్య పథకం మంజూరు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో దేవాదాయ శాఖ పరిధిలో అనేక దేవాలయాలు ఉన్నప్పటికీ అవి దూపదీప నైవేద్యానికి నోచడం లేదన్నారు. వాటికి ఏళ్ల నాటి చరిత్ర ఉన్నా నిర్వహణ లేక శిథిలావస్థకు చేరాయని తెలిపారు.

## హరీశ్‌రావును కలిసిన ఈరవత్రి రాజశేఖర్



**అక్షరటుడే, ఆర్మూర్:** ఈఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్మూర్ నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ తన రాజకీయ రంగప్రవేశం విషయమై మాట్లాడారు. హరీశ్ రావు మాట్లాడుతూ విద్యావంతులు రాజకీయాల్లోకి రావడం ఆహ్వానించదగ్గ పరిణామన్నారు. ఈఆర్ ఫౌండేషన్ ద్వారా సమాజ శ్రేయస్సు కోసం చేస్తున్న కార్యక్రమాలను ఆయన అభినందించారు. రాజకీయంగా ఎదగడానికి నిత్యం ప్రజలతో మమేకమవ్వాలన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు డిష్ రాంప్రసాద్, నూకల శేఖర్, సడక్ ప్రమోద్, సడక్ వినోద్ పాల్గొన్నారు.



## ప్రజావాణికి సమస్యలు నిల్..

**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని మండల ప్రజా పరిషత్, విద్యాశాఖ, రెవెన్యూశాఖ అధికారులు హాజరయ్యారు. అయితే ఎలాంటి ఫిర్యాదులు అందలేదు.

## ఎన్నికల హామీలను అమలు చేయాలి

**అక్షరటుడే, ఇందూరు:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) అర్బన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరేట్ ముందు సోమవారం నిరసన తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయినా ఇచ్చిన హామీలు అమలు కావడం లేదన్నారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లకు బిల్లులను సకాలంలో అందించాలన్నారు. వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలకు, బీడీ కార్మికులందరికీ జీవన భృతి రూ.4 వేలు, వికలాంగుల పెన్షన్ రూ.6000కు పెంచాలన్నారు. తడిసిన వరి, మొక్కజొన్న, పత్తి, సోయాతో పాటు అన్ని పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించి వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నరేందర్, నిజామాబాద్ బోధన్ డివిజన్ కార్యదర్శి వెంకన్న, రాజేశ్వర్, నగర కార్యదర్శి సుధాకర్, నాయకులు గంగాధర్, మల్లేష్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.




ఈ ఏడాది అధిక వర్షాలు కురవడంతో చెరువు కట్టలు, కుంటలు తెగిపోయి రైతులు సాగుచేసిన పంటలు కొట్టుకుపోయి తీవ్ర నష్టం కలిగింది. మిగిలిన పంటలు కాపాడుకునేందుకు అన్నదాతలు నానా అవస్థలు పడ్డారు. అయినా ఆశించిన దిగుబడి రాక ఆందోళన చెందుతున్నారు. కాగా.. ప్రభుత్వం సన్న రకం వరి పంట సాగుచేసిన రైతులకు అందించే రూ. 500 బోనస్‌పైనే ఆశలు పెట్టుకున్నారు.

- అక్షరటుడే, లింగంపేట



# ఆశలన్నీ బోనస్‌పైనే..

▸ సన్నరకం వడ్లకు అందని మద్దతు ▸ దొడ్డు రకం ధాన్యం పండించినప్పటికీ దిగుబడి రాని వైనం.. ▸ రెండు రకాలుగా నష్టపోతున్న రైతన్న

కామారెడ్డి జిల్లాలో ఈ ఏడాది ఎన్నడూ లేనంత విధంగా అధిక వర్షాలు కురిశా యి. దీంతో రైతులు సాగుచేసిన వరి పంట తీవ్రంగా దెబ్బతిన్నది. మిగిలిన పంటలు సైతం పూతకు వచ్చే సమయంలో వర్షాల కారణంగా పూత రాలిపోయి దొడ్డు రకం వరి పంట దిగుబడి అన్నదాతలపై ప్రభావం చూపింది. గతంలో ఎకరాకు 28 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. ప్రస్తుతం 20 క్వింటాళ్ల దిగుబడి రావడం లేదని అన్నదాతలు ఆగమవుతున్నారు.

**సన్నరకంపై..**

ఏడాది అధిక వర్షాలతో సన్నరకం వరి పంటలు సాగు చేసిన రైతన్నలకు కొంతమేర ఉపశమనం కలిగించింది. సన్నరకం వరి పంటకు దొడ్డు రకం వరి పంటకు 15 నుంచి 20 రోజుల వ్యత్యాసం ఉండడంతో సన్నరకంతోనే రైతులకు లబ్ధి చేకూరుతుంది. దీనికి తోడు సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తుండడంతో అన్నదాతలు వాటి కోసం ఎదురుచూస్తున్నారు.

| కామారెడ్డి జిల్లాలో వరిసాగు | |
|---|---|
| దొడ్డు రకం | 1.86వేల ఎకరాలు |
| సన్న రకం | 1.37 వేల ఎకరాలు |

### సగం దిగుబడి వచ్చింది..



నేను ఐదు ఎకరాల్లో దొడ్డు రకం వరి పంటను సాగు చేశాను. గత వర్షాకాలంలో 390 బస్తాల ధాన్యం దిగుబడి రాగా.. ఈ ఏడాది 240 బస్తాలు మాత్రమే వచ్చాయి. సగం దిగుబడి తగ్గిపోయింది. ప్రభుత్వం దొడ్డు రకం ధాన్యం సాగు చేసిన రైతులకు బోనస్ అందజేసి ఆదుకోవాలి.

– పరుశురాం, బోనాల్ బంజారా తండా

### అధిక వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి



కామారెడ్డి జిల్లాలో ఈ ఏడాది అధిక వర్షాలు కురవడంతో చెరువులు, కుంటల కట్టలు తెగిపోయాయి. వాటి కింద సాగుచేసిన పంటలు వరద తాకిడికి కొట్టుకుపోయాయి. పూత వచ్చే సమయంలో వర్షాలు కురవడంతో పూత రాలిపోయింది. దిగుబడి తగ్గిపోయింది. సన్నరకం ధాన్యం సాగుచేసిన రైతులకు కొంతమేర దిగుబడి వచ్చింది. సన్నాలు సాగు చేసిన రైతులకు బోనస్ జమ అవుతోంది.

– అనిల్ కుమార్, మండల వ్యవసాయ అధికారి



## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ మాట్లాడుతూ.. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న పలువురు బాధితులు తమకు ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో బాధితులు దేవేంద్ర, రాధా కృష్ణ, చిన్న గంగారం, హరీష్‌లకు వారి మొబైళ్లను సోమవారం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.



## సామూహిక వందేమాతరం గీతాలాపన

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని గూడెం ప్రాథమిక పాఠశాలలో సోమవారం సామూహిక వందేమాతరం గీతాన్ని బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఆలపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సమయంలో వందేమాతర గీతం ఎందరికో స్ఫూర్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో రాష్ట నాయకులు బాలకిషన్, జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్, సీనియర్ నాయకులు (అడ్వకేట్) అశోక్ కుమార్, పట్టణ అధ్యక్షుడు రాజేష్మా, మండల అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీను, ఐటీ సెల్ గజానన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం




**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ పేర్కొన్నారు. రాజంపేట్ మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ క్యాంటీన్, ఇందిరమ్మ హౌసింగ్, మహిళా శక్తి బృందాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఇందిరా మహిళా శక్తి స్వయం సహాయ సంఘాల కోసం పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన భూమిని ప్రభుత్వ అధికారులు ఇప్పటికే గుర్తించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. గ్రామ మహిళలకు స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని చెప్పారు. కొండాపూర్ గ్రామంలో ఇందిరాక్రాంతి మహిళా సంఘాల కార్యకలాపాల కోసం ప్రత్యేక భవన నిర్మాణాన్ని త్వరలో చేపడతామని ఎమ్మెల్యే మదన్ మోహన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ చీరలు నాణ్యమైనవి: మానాల మోహన్ రెడ్డి



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి :** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పంపిణీ చేస్తున్న ఇందిరమ్మ చీరలు ఎంతో నాణ్యమైనవని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఇనాయత్‌నగర్‌లో సోమవారం మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇందిరా మహిళా శక్తి పేరుతో నాణ్యమైన చీరలను అందిస్తోందన్నారు. ఈ చీరలు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పంచిన చీరలతో పోలిస్తే చాలా నాణ్యమైనవన్నారు. మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం తాము ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తుంటే.. ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి మాత్రం స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పంపిణీ చేస్తున్నారని అనడం సబబు కాదన్నారు. ఎన్నికల షెడ్యూల్ కారణంగానే పంపిణీ ఆలస్యమైందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కమ్మర్‌పల్లి మండల అధ్యక్షుడు సుంకెట రవి, జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పిరెడ్డి శ్రీను, రాములు నాయక్ పాల్గొన్నారు.

## గురుకుల హాస్టల్‌లో విద్యార్థి సూసైడ్

**అక్షరటుడే, బోధన్/వర్ని :** బోధన్ నియోజకవర్గంలోని చందూర్ మండలంలో విషాదం చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. చందూరు మండల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మైనారిటీ గురుకులంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి ఆదివారం రాత్రి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే విద్యార్థి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. చదువులో ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకున్నాడా.. లేక మరేమైనా కారణాలున్నాయా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

## కట్టుకున్నోడినే కడతేర్చారు..

**అక్షరటుడే, భీమ్‌గల్:** కుటుంబ కలహాలతో కట్టుకున్నోడిని కడతేర్చిన ఘటన నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం దేవక్కపేట గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దేవక్కపేట్ గ్రామానికి చెందిన మాలవత్ మోహన్(38)కు ఇద్దరు భార్యలు. అయితే వీరు తరచూ ఇంట్లో గొడవ పడుతూ ఉండేవారు. కాగా.. మోహన్ సోమవారం ఉదయం మద్యం సేవించి ఇంటికి వచ్చి కుర్చీపై నిద్రపోతున్నాడు. ఇదే అదనుగా భావించిన తన ఇద్దరు భార్యలు అతడిపై పెట్రోల్ పోసి పక్కనే ఉన్న పొయ్యిలోంచి నిప్పు తీసి అంటించారు. దీంతో మోహన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మోహన్‌కు ఐదుగురు కూతుళ్లు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.




## ఆర్మూర్ ప్రెస్‌క్లబ్ స్టిక్కర్ల ఆవిష్కరణ

**అక్షరటుడే, ఆర్మూర్ :** పట్టణంలోని ప్రెస్ క్లబ్ కార్యాలయంలో సోమవారం ఆర్మూర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో రూపొందించిన వాహన స్టిక్కర్లను ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్మూర్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చౌల్ సందీప్, పుట్ట మురళి, నెమలి ప్రశాంత్, సురేందర్ గౌడ్, చక్రీ, అజీమ్, చేతన్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో చేపపిల్లలు విడుదల

**అక్షరటుడే, బాల్కొండ:** శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో సోమవారం చేపపిల్లల విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. 2 వేలకు పైగా లైసెన్స్ మత్స్యకారుల లబ్ధికోసం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి సునీల్ ఆదేశాల మేరకు ప్రాజెక్టులో చేపపిల్లల విడుదల కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం ప్రతినిధులు, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.



## డీసీఈబీ కార్యదర్శి నియామకం రద్దు చేయాలి

**అక్షరటుడే, ఇందూరు :** నిబంధనలకు విరుద్ధంగా ఉమ్మడి పరీక్షల విభాగం కార్యదర్శి నియామకాన్ని చేపట్టారని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా గౌరవాధ్యక్షుడు కృపాల్ సింగ్ అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యదర్శిగా నియమించిన సీతయ్య ఇప్పటికే రెండు పర్యాయాలు విధులు నిర్వహించారన్నారు. మళ్లీ ఆయనకే బాధ్యతలు ఇవ్వడం సరి కాదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నియామకాన్ని రద్దుచేసి నూతన కార్యదర్శిని ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సాయ రెడ్డి పాల్గొన్నారు.